క్లుప్తంగా

ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ: విశాఖపట్నంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరుగనున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర మహా సభల పోస్టర్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.గంగాధరరావు బుధవారం ఆవిష్కరించారు. సంఘం వర్సిటీ శాఖ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ మహాసభలలో 1200 మంది ప్రతినిధులు పాల్గొనున్నారని తెలిపారు. మహాసభలలో విద్యారంగ సమస్యలు, విద్యారంగ స్థితి తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ శాఖ వైస్ ప్రెసిడెంట్ మనికంత, జాయింట్ సెక్రటరీ గంగాధర్, సాయి, అక్షయ కుమార్, శివరామరాజు, గణేష్ పాల్గొన్నారు.

నేడు ఏసీ కళాశాలను సందర్శించనున్న నాక్ టీమ్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏసీ కళాశాలను బుధ, గురువారాల్లో నాక్ బృందం సందర్శించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు నాక్ గుర్తింపు కల్పించే విషయమై అకడమిక్‌తో పాటు మౌలిక వసతులతో పాటు వివిధ అంశాల ప్రగతిపై విశ్లేషించనున్నారని పేర్కొన్నారు. కాగా నాక్ టీం పర్యటన నేపథ్యంలో కళాశాల కరస్పాండెంట్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ కేఎఫ్ పరదేశి బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పీఎం వినయ్‌తేజ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపి వేయనున్నట్లు గుంటూరు- 2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరాలో ఉండదని చెప్పారు. బ్రాడీపేట 1/18 నుంచి 6/22 లైను ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

లెనిన్‌కు ఘన నివాళి



లక్ష్మీపురం: సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో తొలి సోషలిస్టు రాజ్య స్థాపకుడు దివంగత లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం నిర్వహించారు. తొలుత లెనిన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు రావుల అంజిబాబు, జి.సురేష్ బాబు, సి.హెచ్.విజయ్‌కుమార్, ఎన్.చిన్న, తోట బాబు, సి.హెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారతీయ మజ్దూర్ సంఘ్ కరపత్రం ఆవిష్కరణ



లక్ష్మీపురం: భారతీయ మజ్దూర్ సంఘ్ తపాలాశాఖ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని జిల్లా కార్యాలయంలో సంఘ్ 70 ఏళ్ల ప్రస్థానంపై కరపత్రాన్ని రాష్ట్ర పూర్వ అధ్యక్షులు మన్నవ శ్రావణ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు డాక్టర్ కల్లకంటి నాగార్జున, సంఘ్ రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీ కృష్ణ, రైల్వే డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పోస్టల్ డివిజన్ కార్యదర్శి మురళీ కృష్ణ, ఆటో యునియన్ కార్యదర్శి వీరేంద్ర కూమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం



పట్నంబజారు: ఇద్దరు విద్యార్థినులకు ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. బ్రాడీపేటలోని శ్రీ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలకు పేద విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, దూపాటి వంశీ, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేరేచర్ల మస్తాన్ వలి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పాల్గొన్నారు.

కమీషన్‌ల కోసం రోగులను బాదేస్తున్నారు

- అవసరం లేకుండానే వైద్య పరీక్షలు
- నియంత్రణలేని ఫీజులు
- వైద్యుల్లో లోపిస్తున్న నైతిక ప్రాక్టీస్



గుంటూరు మెడికల్: గుంటూరు రూరల్ మండలానికి చెందిన కె.సతీష్ ఈనెల 3న జ్వరం, ఒళ్లనొప్పులతో బాధపడుతూ గుంటూరు కొత్తపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం కోసం చేరాడు. జ్వరం పేరుతో చేరిన అతడికి సుమారు 15 రకాల టెస్టులు రాసి వారం రోజులకు రూ.1.50 లక్షల బిల్లువేయటంతో కంగుతిన్నాడు.

- తాడికొండ మండలానికి చెందిన భగత్ తలనొప్పితో బాధపడుతూ స్పెషాలిటీ వైద్యుల కోసం గుంటూరు నగరంలోని ఓ వైద్యుడిని సంప్రదించాడు. భగత్ వైద్యుడి వద్దకు వెళ్ళకుండా అతడి వద్ద పనిచేసే అటెండర్ రక్తపరీక్షలు, ఎమ్మారైస్కాన్ పరీక్ష చేయించుకోమని వైద్యపరీక్షలన్నీ కాగితంపై రాసి ఇవ్వటంతో వైద్యపరీక్షల కోసమే రూ.15 వేలు ఖర్చు అవ్వటంతో బిల్లుచూసి తలతిరిగిపోయింది. మందులు, డాక్టర్ ఫీజు అన్నింటిని కలుపుకుని ఒక్కరోజులోనే వైద్య ఖర్చుల కోసం రూ.20 వేలు ఖర్చు అవ్వటంతో గ్రామీణ ప్రాంతానికి చెందిన భగత్ బిక్కమొఖం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. ఇలా ప్రతిరోజూ ఎంతో మంది రోగులు వివిధ రకాల స్పెషాలిటి వైద్యుల వద్దకు వెళ్లి జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు.

ఒప్పందాలు ఇలా..

ఆస్పత్రి నిర్వాహకులకు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు మధ్య కమీషన్ ఒప్పందం ఉండటంతో అవసరం లేకపోయినా వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాసి రోగులకు వైద్యం తడిసిమోపెడయ్యేలా చేస్తున్నారని పలువురు సీనియర్ వైద్య నిపుణులే వాపోవుతున్నారు. రోగిని తొలుత ఫిజికల్‌గా పరీక్షించి నాడిపట్టి వైద్యం చేయాల్సిన వైద్యులు కమీషన్ల కోసం కక్కుర్తి పడుతూ రోగి ముఖం కూడా చూడకుండానే వివిధ రకాల వైద్య పరీక్షలు రాస్తున్నారు. కొంత మంది రోగులను వైద్యుల వద్దకు కూడా వెళ్లనీయకుండా డాక్టర్ వద్ద పనిచేసే అసిస్టెంట్స్‌లు తమ వద్ద వివిధ రకాల టెస్టుల పేరుతో ఉన్న పుస్తకాల్లో పేజీలను చింపి పెన్నుతో టిక్కుపెట్టి పంపిస్తూ రోగులను అందిన కాడికి టెస్టుల పేరుతో దోచుకుంటున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి...

డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు దోమకాటు వల్ల వ్యాపించే ప్రమాదం ఉంది. ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అంతంత మాత్రంగా ఉండటం, జ్వరాలపై ఉన్న భయంతో రోగులు పట్టణాలకు పరుగులు తీస్తూ ఉండటంతో రోగుల భయాలను కొందరు వైద్యులు క్యాష్ చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిస్‌మెంట్స్(రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్) యాక్ట్-2002 ప్రకారం వైద్యులు ఏ రోగానికి ఎంత మేరకు ఫీజులు తీసుకుంటున్నారో నోటీస్ బోర్డులో తెలియజేయాల్సి ఉంది. చాలా ఆస్పత్రుల్లో అలాంటి బోర్డులు కనిపించటం లేదు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించి చట్టం అమలు జరిగేలా, వైద్యుల అనైతిక ప్రాక్టీస్‌కు చెక్‌పెట్టి రోగులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని బాధితులు కోరుతున్నారు.

ఎమ్మారై, సీటీ స్కాన్‌లో సగానికి పైగా వైద్యులకే...

ఎమ్మారై, సీటీ స్కాన్ లాంటి వైద్య పరీక్షలకు రోగుల వద్ద నుంచి వసూలు చేసే ఫీజులో సగానికి పైగా రోగిని తమ వద్దకు పరీక్ష కోసం పంపిన వైద్యులకే అందజేస్తున్నామని స్కాన్ సెంటర్స్ నిర్వాహకులు చెబుతున్నారు. సీటీ స్కాన్ పరీక్ష కోసం రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు. అందులో సగానికి పైగా డాక్టర్స్‌కు చెల్లిస్తున్నారు. ఎమ్మారై స్కానింగ్ కోసం రూ.7 వేల నుంచి రూ.14 వేలు వరకు వసూలు చేసి సగం డబ్బులు వైద్యులకు కమీషన్ రూపంలో అందుతున్నాయి. ల్యాబ్‌లలో చేసే వివిధ రకాల రక్త పరీక్షలకు వసూలు చేసే ఫీజులో 40 నుంచి 60 శాతం వరకు వైద్యులకు ముట్టచెప్పుతున్నారు. ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు తమకు రిఫర్ చేయాలని పుస్తకాలను వైద్యుల వద్దకు పంపిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం ఏ వైద్యుడి నుంచి ఎన్ని రిఫరల్ లెటర్స్ వస్తే అంత కమీషన్ అప్పగిస్తున్నారు. గతంలో వారానికి లేదా పుస్తకం పూర్తి కాగానే కమీషన్‌ను అప్పగించేవారు. నేడు సాయంత్రానికి కల్లా తమకు ఇవ్వాల్సిన కమీషన్ పంపించాలని లేకపోతే రెండో రోజు తమ స్కానింగ్ సెంటర్ లేదా ల్యాబ్‌కు సదరు వైద్యులు రోగులను పంపటం లేదని స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు తెలిపారు. కమీషన్లు తీసుకోకుండా జీజీహెచ్ వైద్యులకు తాము పంపే రోగికి కేవలం రూ.3 వేలకే సీటీ స్కాన్ పరీక్ష, రూ.5 వేలకు ఎమ్మారై స్కానింగ్ పరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌ల్లో చేస్తున్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో వాటిని భర్తీ చేయలేదన్నారు. ప్రస్తుతం తిరిగి వాటికి రీ నోటిఫికేషన్ ఇస్తున్నామని చెప్పారు. గతంలో ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థినులు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సంబంధిత ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఖాళీగా ఉన్న స్థానాల వివరాలు.. అంకిరెడ్డిపాలెం(బీసీ - ఏ), అంకమ్మనగర్ 2(ఓసీ), గుజ్జనగుండ్ల 1(బీసీ ఈ), గోరంట్ల మేరీ ప్రియనగర్(ఎస్సీ), జానీ నగర్ సుద్దపల్లి డొంక(ఓసీ), వెంగళరావునగర్ 1 (ఎస్సీ), ఆర్ అగ్రహారం(ఓసీ), అంకిరెడ్డిపాలెం(ఎస్సీ), ఎస్సీ పెదపలకలూరు స్వర్ణాంధ్ర నగర్(ఓసీ), సమ్మర్‌పేట(ఓసీ), సుగాలి కాలనీ(ఎస్టీ), నల్లకుంట 1(ఎస్సీ), స్వర్ణ భారతి నగర్ 2(ఓసీ), శ్రీనివాసరావుతోట 2(బీసీ- డీ), కేవీపీ కాలనీ 1(బీసీ ఏ), చైతన్యనగర్ 2(ఓసీ), ఏటుకూరు మెయిన్(ఓసీ), గోరంట్ల బొడ్డురాయి(ఓసీ), వల్లూరివారితోట(ఓసీ), వీవర్సుకాలనీ (బీసీ బీ).

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి

నెహ్రూనగర్: శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు ప్రారంభానికి ముందే నగరంలోని ప్రధాన రహదారులను ట్రాఫిక్ రద్దీకి తగిన విధంగా సిద్ధం చేసుకోవాలని, ట్రాఫిక్, రైల్వే, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, నగరపాలక సంస్థ, రైల్వే, ఆర్ అండ్ బీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సంయుక్త సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్ విస్తరణ పనులు ప్రారంభించామని, ఇప్పటికే ప్రభావిత భవన యజమానులకు నోటీసులు ఇచ్చి, అంగీకారం తెలిపిన భవనాలను తొలగిస్తున్నామన్నారు. ఆర్వోబీ పనులు ప్రారంభమైతే గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రధాన రహదారులను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ప్రధానంగా మూడు వంతెనల వద్ద మరొక వెంట్ ఏర్పాటు చేసి, రోడ్ వెడల్పు చేయడానికి రైల్వే అధికారులు పరిశీలించాలని, తద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చన్నారు. శంకర్ విలాస్ సెంటర్ నుంచి అమరావతి రోడ్‌లోని ఇన్నర్ రింగ్ రోడ్ జంక్షన్ వరకు, బ్రాడీపేట, అరండల్ పేటల్లో రోడ్ల ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రైల్వే ఏడీఎం ముఖేష్ కుమార్, డీఈఎన్ భరత్ కుమార్, నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఆర్అండ్‌బీ ఈఈ విశ్వనాధరెడ్డి, డీఈఈ చిన్నయ్య, ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, చిన్నయ్య పాల్గొన్నారు.

పక్కాగా పారిశుద్ధ్య పనులు జరిగేలా చూడాలి

వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు మస్టర్ సమయంలో తప్పనిసరిగా ప్రజారోగ్య కార్మికుల హాజరు తీసుకోవాలని, మైక్రో పాయింట్స్ వారిగా పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు పారిశుద్ధ్య పనులు జరిగేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నాజ్ సెంటర్ రిజర్వాయర్‌లోని మస్టర్ పాయింట్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్మికులు, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికుల హాజరును సచివాలయ శానిటేషన్ కార్యదర్శులే తీసుకోవాలని కోరారు. శానిటేషన్ డివిజన్ల వారీగా పారిశుద్ధ్య పనులకు అవసరమైన పుష్ కాట్స్, డంపర్ బిన్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించి, కార్మికులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కావేరి నగర్, నగరంపాలెం దర్గా వెనుక రోడ్, ఐపీడీ కాలనీ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, నూతన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు డ్రెయిన్ టూ డ్రెయిన్ ఉండేలా, డ్రెయిన్ల నిర్మాణం చేసిన తర్వాతనే రోడ్ల నిర్మాణం చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతనంగా నిర్మాణం చేసిన డ్రెయిన్లలో మురుగుపారుదల సక్రమంగా ఉండడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్మాణ సమయంలో లెవల్స్ పాటించాలని ఎమినిటీ సెక్రటరీలను ఆదేశించారు. పర్యటనలో డీఈఈ మధుసూదనరావు, ఆర్‌ఓ మదన్ గోపాల్ పాల్గొన్నారు.

సర్వేలను వేగవంతం చేయాలి

ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేలన్నింటిని వేగవంతం చేయాలని, నోడల్ అధికారులు కార్యదర్శులు చేస్తున్న సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సచివాలయాల కార్యదర్శులు, నోడల్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సిటిజెన్ డేటాబేస్‌ను సిద్ధం చేయడానికి, సూక్ష్మ, మధ్యతరగతి వ్యాపార సంస్థలకు రాష్ట్ర, కేంద్ర సంక్షేమ పథకాలు అమలు చేయడానికి సర్వేలు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివారావు, సెక్రటరీ పి.శ్రీనివాసరావు, ఆర్వో రెహమాన్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జితో మర్యాద పూర్వక భేటీ



హైకోర్టు జడ్జి జయసూర్యతో కాసు వెంకటరెడ్డి, వట్టిజొన్నల బ్రహ్మరెడ్డి, న్యాయవాదులు

నగరంపాలెం: గుంటూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించనున్న హైకోర్టు జడ్జి జస్టిస్ జయసూర్యను మంగళవారం హైకోర్టులోని ఆయన చాంబర్‌లో గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మరెడ్డి, పొన్నూరు బార్ అధ్యక్షుడు జయరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో న్యాయమూర్తుల నియమాకాలపై, కోర్టుల్లో నెలకొన్న సమస్యలపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో వాటిని పరిష్కారించేందుకు హామీ ఇచ్చారని న్యాయవాదులు తెలిపారు. పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావు, ఆనంద్, న్యాయవాదులు కలిసిన వారిలో ఉన్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చిదంబరంను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసులు జరిపిన దాడి ఘటనపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై హైకోర్టులో రిట్ దాఖలు చేయాలని, బేతాళ ప్రకాశరావుపై నమోదైన కేసులు తొలగించేలా క్లాష్ పిటిషన్ వేయాలని నిర్ణయించారు. అన్ని విధాలుగా న్యాయ సహకారం బేతాళ ప్రకాశరావుకి అందిస్తామని ఆయన హామీఇచ్చారు.

26న 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ ఈనెల 26 నిర్వహించనున్నారు. స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న ఆహ్వాన పత్రికలను మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పుస్తకంతో పాటు మరో నాలుగు పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. శాసనమండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, వి.శ్రీనివాసరావు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, ఎల్ఐసీ ఉద్యోగ సంఘ నాయకుడు వీవీకే సురేష్, ఎల్ఎస్ భారవి, అవధానుల హరి, కైలాష్‌నాథ్, ఎస్ఎం సుభానీ, వెంకట్రావు పాల్గొన్నారు.

బీజేపీ ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించాలి

సీపీఎం నాయకుడు నర్సింగరావు



మాట్లాడుతున్న నర్సింగారావు, వై.నేతాజీ

లక్ష్మీపురం: బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలు అనుసరిస్తుందని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతి సభ మంగళవారం గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ రాసిన సిద్ధాంతాన్ని లెనిన్ రష్యాలో సోషలిజం సాధించటం ద్వారా ఆచరణలోకి తెచ్చారని పేర్కొన్నారు. లెనిన్ చెప్పిన విధంగా నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని అన్వయించటం ద్వారా భారత దేశంలో కార్మికవర్గ విప్లవాన్ని జయప్రదం చేయటానికి ప్రజల్ని చైతన్యవంతం చేయాలన్నారు. దేశంలో బీజేపీ ఫాసిస్టు విధానాలు అనుసరిస్తుందని, రాష్ట్రాల హక్కులను కుదిస్తుందని దుయ్యబట్టారు. గవర్నర్లను అడ్డుపెట్టుకొని రాష్ట్రాలపై పెత్తనం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా ఆర్థికంగా అణచివేస్తుందని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ కార్మికుల ఉపాధిని విస్మరించి, ఏఐ వంటి నూతన టెక్నాలజీని ప్రోత్సహిస్తే ఉత్పత్తి పోగుబడి, ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి సంక్షోభం వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ గుమస్తా అత్యుత్సాహం.. సీపీ క్షమాపణలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే ఓ గుమస్తా అత్యుత్సాహంతో చేసిన పనికి సిటీ ప్లానర్ వీఆర్వోలకు క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఘటన సోమవారం రాత్రి నగరపాలక సంస్థ కార్యాలయంలో చోటుచేసుకుంది. వార్డు సచివాలయంలో పనిచేసే గ్రేడ్- 2, వీఆర్వోలకు జీతాలు సిటీ ప్లానర్ ప్రాసెస్ చేస్తుంటారు. ఈ క్రమంలో సీపీ వారితో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశిస్తే కింది స్థాయి గుమస్తా అత్యుత్సాహానికి పోయి సీపీ చాంబర్‌కు సచివాలయంలో పనిచేసే వీఆర్వోలంతా హాజరు కావాలని లేని పక్షంలో మీ జీతాలు నిలుపుదల చేస్తామని మేసేజ్‌లు పెట్టారు. దీంతో వీఆర్వోలంతా సీపీ చాంబర్‌కు చేరుకున్నారు. ఏదైన అక్రమంగా, రోడ్డు విస్తరణలో బిల్డింగ్ కూలుస్తున్నప్పుడు వీఆర్వోలు హాజరై పంచనామా ఎందుకు రాయడం లేదంటూ సిటీ ప్లానర్ వీఆర్వోలను ప్రశ్నించారు. వీఆర్వోలకు తహసీల్దార్ కార్యాలయంలో ఏం పని.. మీకు జీతాలు వేసేది జీఎంసీ కదా అని నిలదీశారు. దీంతో వీఆర్వోలు పలు ధ్రువ పత్రాల మంజూరుకు సంబంధించి పేపర్లను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువెళుతుంటామని, దీంతో పాటు ఇతర ప్రొటోకాల్, రేషన్ సరుకుల పంపిణీ కూడా చూసుకుంటుంటామని చెప్పారు. మేము పంచనామాకి రావాలంటే తహసీల్దార్‌కు లేటర్ రాస్తే ఆయన ఆదేశిస్తే వస్తామని స్పష్టం చేశారు. మీరు అక్రమ కట్టడం జరగకుండా చూస్తే మాతో పని ఉండదు కదా సర్.. ఇప్పుడు మమ్మలిందరిని పిలిచి ఇలా నిలబెట్టి క్లాస్ పీకడం ఎంత వరకు సబబు... సమావేశానికి రాకపోతే జీతాలు అపుతామని బెదిరించడం ఎంత వరకు కరెక్ట్ అంటూ సీపీని నిలదీశారు. నేను జీతాలు ఆపుతామని ఎప్పుడు చెప్పలేదు.. ఎవరూ చెప్పారని ఆరా తీయగా గుమస్తా అత్యుత్సాహంతో పెట్టిన మేసేజ్‌ని సీపీకి చూపించడంతో... తప్పు తెలుసుకున్న సీపీ వీఆర్వోలకు క్షమాపణలు చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



వెనిగండ్లలో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

పెదకాకాని: రక్షిత మంచినీటి పథకం ద్వారా సక్రమంగా నీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్ షేక్ అబ్దుల్ మతిన్ అన్నారు. గత కొంతకాలంగా మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలో నీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంపై పలుమార్లు 'సాక్షి'లో కథనాలు వెలువడ్డాయి. గతంలో రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుండగా గత నాలుగు నెలలుగా మూడు రోజులకు, నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతుంది. దీంతో నిరుపేదలు సైతం వాటర్ ప్లాంట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రక్షిత మంచి నీటి పథకం పరిశీలనలో భాగంగా మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో మంచినీటి చెరువు, పంప్‌హౌస్, గుంటూరు ఛానల్(కొత్తకాలువ)ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గ్రామంలో నీటి సరఫరా చేసేందుకు అన్ని రకాల వనరులు ఉన్నప్పటికీ సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారన్నారు. ఇటీవల గుంటూరు ఛానల్ వద్ద పంప్‌హౌస్‌లో అమర్చిన కొత్త మోటారు ద్వారా రావాల్సిన నీటిలో 20 శాతం కూడా రావడం లేదన్నారు. పంచాయితీ నిర్వహణలో ఉన్న బోరు నీరు టెస్టింగ్ చేసి ఆ నీటిని కూడా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నూతనంగా మరో బోరు వేయించేందుకు పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఫిల్టర్ బెడ్‌లలోకి చెరువు నీటిని పంపించాలా.. పంప్‌హౌస్ నుంచి వస్తున్న నీటిని నేరుగా పంపింగ్ చేయాలా.. అనే అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సారిక, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌పై డీఎంహెచ్ఓకు ఫిర్యాదు

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డి.నాగకార్తీక్‌పై ఈనెల 20న ఏపీ ఎన్జీవో నేతలు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నాగ కార్తీక్ ఉద్యోగుల సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, నెలల తరబడి సమస్యలు పరిష్కరించకుండా ఉద్యోగులను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తక్షణమే సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. హెల్త్ విజిటర్‌గా విధులు నిర్వహించి గతేడాది ఏప్రిల్ 30న పదవీ విరమణ చేసిన పి.పద్మావతికి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు ఇప్పటికీ రాకపోవడానికి సీనియర్ అసిస్టెంట్ కారణమని పేర్కొన్నారు. గత ఏడాది మే 10న మృతి చెందిన వైద్య ఉద్యోగి మంచాల ఏసుదాసుకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ఇప్పటి వరకు అతని కుటుంబ సభ్యులకు చెల్లించలేదని ఆరోపించారు. హెల్త్ విజిటర్ రమాదేవి జాయినింగ్ రిపోర్టు ఇచ్చినా సదరు రిపోర్టును ఉన్నతాధికారులకు పంపించి పోస్టింగ్ ఇచ్చేందుకు నాలుగు నెలల పాటు సీనియర్ అసిస్టెంట్ కాలయాపన చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు నాగ కార్తీక్‌పై ఫిర్యాదు చేయడంతో స్పందించిన డీఎంహెచ్ఓ సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశించనున్నట్లు హామీ ఇచ్చారు. డీఎంహెచ్‌ను కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, నగర అధ్యక్షుడు సూరి, నగర కార్యదర్శి చింతల కళ్యాణ్‌కుమార్ ఉన్నారు.

ట్రంప్ పాలనపై భయాందోళన



లక్ష్మీపురం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టమైన విధానాలతో కూడిన వైఖరితో ప్రపంచ దేశాల మన్ననలను చూరగొనాలని విశ్లేషకులు, విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో రెండోసారి ట్రంప్ పాలనపై చర్చ గోష్ఠి మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి విద్యావేత్త ఆర్‌పీ సింగరయ్య, విశ్రాంత అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

గుంటూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఓబులనాయుడుపాలెం సమీపంలో ఎన్‌హెచ్-16లో యువకుడు రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలపాలై మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థినికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషిచేస్తుందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. మంగళవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 43 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఏడాదికి రూ 2.5 లక్షల వార్షిక వేతనంతో సంస్థ విద్యార్థినులతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన విద్యార్థినులను కళాశాల ఉపాధికల్పనాధికారి డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్ రోజ్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

ఇంకుడు గుంతలకు ప్రాధాన్యం

డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్



చేబ్రోలు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనుల్లో ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా ప్రాజెక్ట్ డైరక్టర్ వి.శంకర్ అన్నారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను, నారాకోడూరు, వేజండ్ల గ్రామాల్లో గోకులం షెడ్లను మంగళవారం పీడీ శంకర్ పరిశీలించారు. మంచాల గ్రామంలో పంట కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. నారాకోడూరు, వేజండ్ల గ్రామాల్లో గోకులం షెడ్లను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. పీడీ శంకర్ వెంట ఎంపీడీఓ కె.లలిత, ఏపీఓ ఆనంద మోహన్, ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

